# దారిలో దొరికిన ప్రేమలేఖలు



– ???

*ఎవరు వ్రాశారో తెలియదు, ఎవరికి వ్రాశారో తెలియదు. దొరికిన ప్రేమలేఖల సంపుటినుంచి నెలకో ప్రేమలేఖ !!*

## – 11 –

### *నీడ*

మనిషికి నీడ తోడు..చిట్టచివరి నిముషంవరకూ. అంతెందుకూ.. మనిషి చనిపోయిన తరవాత ఆ శవం చెయ్యి పైకెత్తినా, శవాన్నే పైకెత్తినా దానికీ నీడ వుంటుంది. శవాన్ని కాల్చి బూడిద చేసి ఓ సంచిలో పోస్తే - ఆ సంచికీ నీడ ఉంటుంది. ఆ బూడిదని గుప్పెట పట్టి పైకెగరేస్తే, క్రిందపడే ప్రతి పరమాణువుకి కూడా నీడే ఉంటుంది. భగవంతుడు మనిషికి తోడుగా ఇచ్చింది నీడ అనే వరం ఒక్కటే. ఆఖరికి పూడ్చిపెట్టిన శవాన్ని మళ్ళీ పైకి తీసినా - దానికీ నీడ ఉంటుంది. ఎంత గొప్పదీ నీడ.



కానీ నేస్తం.. మనసుకు తోడు? మనిషికి నీడవున్నా మనసుకి నీడలేదే  అసలు మనసు కంటికి కనిపించనే కనిపించదే! మనసుకి తోడు మనసు మాత్రమే అని తెలియడానికి చాలాకాలం పట్టింది నేస్తమా. నిన్ను చూస్తాను. నువ్వు నన్ను చూశావు అని అనుకుంటాను. అంతే! ఓ ఊహల జలపాతం మీదుగా ఆశల సరస్సులోకి జారిపోతాను. మళ్ళీ నువు నాకు కనిపించేంత వరకు నా మనసుకు నీ ఆలోచనలే తోడు.

చిత్రం తెలుసా? నన్ను నేను మరిచిపోవడానికి ఆలంబన 'నువ్వు' అన్నమాట. ప్రేమంటే ఇదేనా? తనను తాను మరవడమేనా? హృదయం నాది.. కానీ అది ప్రేమించేది నిన్ను. కళ్ళునావి.. కానీ అవి వెతికేది నిన్ను. మనసు నాది.. ఆలోచనలు నీవి.

ప్రతిక్షణమూ ఓ పలవరమే.. ప్రతిక్షణమూ ఓ పరవశమే.. నీ ఆలోచనలు నా తోడున్నప్పుడు. మరి అవిలేనప్పుడూ?

అడక్కు. నా మనసే ఓ పంజరమైనా ఊహల్ని బంధించేస్తుంది. ఆశల రెక్కలు విరిచేస్తుంది. నిరాశ అనే నిప్పులోకి తోసేస్తుంది.

ఇదో ఉన్మాదం. సరే.. ఆ తరవాత? ఆలోచించడానికి నా మనసెందుకో వ్యతిరేకిస్తోంది. బహుశా యీ ప్రేమకూడా ఓ రకమైన 'భ్రాంతి' అనే నిజాన్ని తట్టుకోలేకో, నిజాన్ని ఒప్పుకోలేకో. దగ్గరయ్యేంత వరకే వుంటుంది పరస్పరాకర్షణ. ఆ తరవాత ఒకరి తప్పుల్ని మరొకరి అతి సూక్ష్మంగా వెతుక్కుంటాం. ఆ వెతికితే దొరికిన తప్పుల్ని దెబ్బలాటలకి 'వేదికగా' మార్చుతాం. ఆ తరవాత 'ఛీ.. ఇదా నేను కోరుకున్నదీ' అని మనని మనమే తిట్టుకుంటాం. ఆ అసంతృప్తిని మాటలుగా మొదట, ఆ తరవాత శూలాలుగా మార్చి ఒకరిపైన ఒకరం గురిచూసి మరీ విసురుకుంటాం. ప్రతిమాటా ఓ శూలపు పోటై గుండెల్లో సూటిగా దిగి వెచ్చని రక్తాన్ని స్రవిస్తుంది. కానీ, యీ రక్తం కంటికి కనిపించదు. Then? ఒకరి ఉనికి మరొకరికి భరించరానిదవుతుంది. పున్నమి తన వెలుగుని కోల్పోయి కోల్పోయి అమావాస అవుతుంది.

ఇదిగో.. ఇవీ నా ఊహలు! అందుకే, నా ప్రేమని నాలోనే దాచుకుంటున్నా. వ్యక్తపరిస్తే నువ్వు వొప్పుకోవచ్చు. ప్రియాతిప్రియమైనదానా, నిన్ను తప్పు పట్టడం అనే ఊహనే నేను భరించలేను. నువ్వు నాకు దూరంగా వున్నావనే నింద యీలోకం వేస్తే వెయ్యనివ్వుగాక. నువ్వు దూరంగా వెళ్ళనే లేవు. ఎందుకో తెలుసా? నువ్వున్నది నా గుండెల్లోనే కదా. ఊపిరి నాది.. ఊసులు నీవి.. ఆశనాది... శ్వాసనీది.

ఇట్లు

నీ

-X-



*(వచ్చేనెల మరో ప్రేమలేఖ)*

Post your comments